సాక్షి కర్నూలు

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



హెల్మెట్ లేకుంటే జరిమానా

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి సోమవారం భారీ జరిమానాలు వేశారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అపరాధ రుసుం విధించారు. 8లో ▶



నూతన మద్యం బార్లకు నోటిఫికేషన్

మూడేళ్ల కాలపరిమితితో నూతన మద్యం పాలసీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 47 నూతన బార్లకు సోమవారం గజిట్ విడుదల చేశారు. 8లో ▶



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.75
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 78.969
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,01,313
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,14,079

న్యూస్‌రీల్

జీడీపీకి కొనసాగుతున్న వరద



గాజులదిన్నె ప్రాజెక్ట్‌లో నిల్వ ఉన్న నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టుకు గత వారం రోజులుగా వరద నీటి చేరిక కొనసాగుతోంది. మండలంలో పది రోజులుగా తెలికపాటి నుంచి మోసరు వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సోమవారం 300 క్యూసెక్కుల వరద నీరు జీడీపీలోకి చేరినట్లు ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. అలాగే హంద్రీనీవా నుంచి 160 క్యూసెక్కుల నీరు, ఎల్లెల్సీ నుంచి 60 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వస్తుంది. జీడీపీ నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా.. సోమవారం సాయంత్రానికి 2.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు



ఉద్యోగ పత్రాలను అందజేస్తున్న ఎక్సైజ్ జిల్లా అధికారి సుధీర్ బాబు

కర్నూలు: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తూ విధి నిర్వహణలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు ఎక్సైజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ నియామక పత్రాలను జిల్లా అధికారి సుధీర్ బాబు అందజేశారు. ఈ మేరకు హైమావతి, సౌమ్యలకు కారుణ్య నియామకాల కింద ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాలిస్తూ కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వులిచ్చారు. వీరికి జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు సోమవారం తన కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా జి. శ్రీనివాస్



రిజిస్ట్రార్‌ను అభినందిస్తున్న వర్సిటీ వీసీ

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్.జి శ్రీనివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు డిప్యూటేషన్‌పై రిజిస్ట్రార్‌గా గత ఏడాది నుంచి పని చేస్తున్నారు. ఆయన పదవీ కాలం ముగియడంతో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ జి.శ్రీనివాస్‌ను వర్సిటీ వీసీ, ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా పని చేసిన కె.వెంకటేశ్వర్లు, ఆర్‌యూ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ శాలువ కప్పి అభినందించారు.

20, 21 తేదీల్లో రీవెరిఫికేషన్‌కు మరో అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): దివ్యాంగుల పింఛను తీసుకుంటూ రీ వెరిఫికేషన్‌కు హాజరుకాని వారికి డీఆర్‌డీఏ మరో అవకాశం కల్పించింది. సదరం రీ వెరిఫికేషన్‌కు హాజరు కాలేదనే కారణంతో జిల్లాలో 461 మంది దివ్యాంగుల పింఛన్లను ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. వీరికి ఆగస్టు నెల పింఛను పంపిణీ చేయలేదు. రీ వెరిఫికేషన్‌కు హాజరు కాని 461 మందికి ఈ నెల 20, 21 తేదీల్లో సంబంధిత ఆసుపత్రుల్లో డాక్టర్లు రీ వెరిఫికేషన్ చేస్తారని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వైపి రమణారెడ్డి తెలిపారు.

పుట్టుకతో చెవిటి, మూగ.. ఆపై మెదడులో సమస్య



ఈ బాలిక పేరు ఎస్.మెహతాజ్. కర్నూలు నగరంలోని చిత్తారివీధి. పుట్టుకతోనే చెవిటి, మూగ. 2011లో సదరం క్యాంపునకు హాజరు కాగా వైద్యులు పరీక్షలు నిర్వహించి 100 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ జారీ చేశారు. ఆ తర్వాత బాలికకు మెదడులోనూ సమస్య మొదలైంది. ఇటీవల సదరం రీ వెరిఫికేషన్‌కు హాజరు కాగా.. 40శాతం లోపే సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. అది కూడా తాత్కాలికమేనంటూ పింఛనుకు అనర్హురాలిగా తేల్చారు.

పక్షవాతం వేధిస్తున్నా పింఛను పోయింది



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు శివరామ్ మధు. ఓర్వకల్ మండలం లొద్దిపల్లి గ్రామం. కొన్నేళ్ల క్రితమే పక్షవాతంతో ఎడమ చేయి, కాలు పడిపోయాయి. 2010లో సదరం క్యాంపునకు హాజరు కాగా 94 శాతం వికలత్వం ఉన్నట్లు ధ్రువీకరించారు. ఇప్పటికీ ఒకరి సహాయం లేనిదే కదల్లేని పరిస్థితి. ఇటీవల నిర్వహించిన రీవెరిఫికేషన్‌లో అసలు వికలత్వమే లేనట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పింఛనుకు అనర్హుడిగా నోటీసు అందించారు.

కూర్చోలేదు, నిల్చోలేదు.. వికలత్వమే లేదంట!



ఈమె పేరు ఉప్పరి వెంకటలక్ష్మి. తుగ్గలి మండలం అమీనాబాద్ గ్రామం. చిన్నతనంలోనే పోలియో బారిన పడింది. దీనికి తోడు కింద పడటంతో కాలు విరిగి రాడ్ వేయించుకుంది. సొంతంగా కూర్చోలేదు, నిలబడలేదు. గతంలో 72 శాతం వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ జారీ చేశారు. ఇటీవల రీవెరిఫికేషన్‌కు హాజరు కాగా అసలు వికలత్వమే లేనట్లు పేర్కొనడం గమనార్హం. ఈ కారణంగా ఆమె పింఛను కోల్పోయింది.

రీ వెరిఫికేషన్ 'లోప'భూయిష్టం!

- పింఛన్ల రద్దు నోటీసులతో దివ్యాంగుల గగ్గోలు
- గతంలో వంద శాతం వికలత్వం ఉన్నట్లు సదరంలోనే ధ్రువీకరణ
- ఇప్పుడు ఏకంగా 40 శాతం కూడా లేనట్లు సర్టిఫికెట్లు
- కొందరికి ఎలాంటి వైకల్యం లేకపోయినా పెరిగిన వైకల్య శాతం
- రాజకీయ సిఫారసులకు పెద్దపీట!
- పెద్ద ఎత్తున నిరసనలకు సిద్ధమవుతున్న దివ్యాంగులు



తుగ్గలి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

కళ్లులేని ప్రభుత్వం.. కనికరంలేని నిర్ణయం!

కర్నూలు జిల్లాలో **5,250** / తొలగించిన పింఛన్లు / **4,800** నంద్యాల జిల్లాలో

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం దివ్యాంగులను వీధిన పడేసింది. ఉన్న కాస్త ఆసరాను కూడా దూరం చేసి నిర్దయగా వ్యవహరిస్తోంది. ఊహించినట్లుగానే అనర్హత పేరిట పెద్ద ఎత్తున పింఛన్లను తొలగించడంతో దివ్యాంగులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో చాలాచోట్ల రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. వంద కాదు.. రెండు వందలు కాదు.. ఏకంగా వేలాది పింఛన్లను అనర్హత ముసుగులో అడ్డంగా తొలగించడం విమర్శలకు తావిస్తోంది. సదరం సర్టిఫికెట్ల జారీ 2009–2010లో మొదలైంది. అప్పట్లో 100 శాతం వికలత్వం ఉంటే నేడు రీ వెరిఫికేషన్‌లో 40 శాతంలోపునకు తగ్గిపోయి పింఛను లేకుండా పోతోంది. సదరం క్యాంపుల్లో బేరసారాలు, రాజకీయ సిఫారసులకు పెద్దపీట వేసినట్లు చర్చ జరుగుతోంది. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు పింఛన్లు పోయిన దివ్యాంగులు క్యూ కట్టారు. గతంలో వెరిఫై చేసి సర్టిఫికెట్లు ఇచ్చింది డాక్టర్లే.. అప్పుడు 85, 90, 100 శాతం వికలత్వం ఉంటే ఇప్పుడు 40 లోపు ఎలా తగ్గుతోందంటూ బాధితులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

ఇప్పుడిప్పుడే బయటపడుతున్న తొలగింపులు

దివ్యాంగుల పింఛను తొలగింపులు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో సచివాలయాలు తెరుచుకోలేదు. సోమవారం వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు దివ్యాంగులకు రీ వెరిఫికేషన్ సదరం సర్టిఫికెట్, నోటీసులు ఇస్తున్నారు. నోటీసులు అందుకున్న వారిలో ఎక్కువ మందికి పింఛనుకు అనర్హత ఉన్నట్లు తేలడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. దిక్కుతోచని స్థితిలో కలెక్టరేట్‌కు, మండలాల్లో ఎంపీడీఓల వద్దకు చేరుకొని తమ గోడు వినిపిస్తున్నారు. అనధికార సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో 10,050 పింఛన్లను తొలగించారు. ఈ నెల 27వ తేదీ వరకు సదరం రీ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, నోటీసులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. రోజురోజుకు పింఛన్లు కోల్పోయే వారి సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తొలగింపులకు గురైన వారిలో చెవిటి, మూగ, శారీరక వికలాంగులు, అంధులే అధికంగా ఉంటున్నారు.

సిఫారసులకు పెద్దపీట

సరదం రీవెరిఫికేషన్‌లో రాజకీయాలు, సిపారసులు జోరుగా సాగినట్లు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. సిపారసులు ఉన్న వారికి రూ.15వేల పింఛను వచ్చే విధంగా 85 నుంచి 100 శాతం వరకు వికలత్వం సమోదు చేయడం గమనార్హం. సదరం రీ వెరిఫికేషన్ జరిగే చోటుకు ఇతరులను అనుమతించడం లేదనేది ఉత్తుత్తిదేనని స్పష్టమవుతోంది.

చిన్న లోపానికి 90 శాతమట!

కోడుమూరులోని 5వ సచివాలయం పరిధిలో ఓ వ్యక్తికి అన్ని అవయవాలు సవ్యంగానే ఉన్నాయి. అయితే రెండు వేళ్లు దెబ్బతిన్నాయి. ఇది వరకు ఈయనకు 50 శాతం వరకే వికలత్వం ఉంది. రూ.6వేల పింఛను తీసుకుంటున్నాడు. కాళ్లు, చేతులు బాగున్న ఇతను అన్ని పనులు సొంతంగానే చేసుకుంటున్నాడు. ఈయనకు సదరం రీ వెరిఫికేషన్‌లో ఏకంగా 90 శాతం వికలత్వం నమోదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

కళ్లుంటే ఈమెకేసి చూడండి..

బండి ఆత్మకూరు: ఈమె పేరు అంబటి చాముండేశ్వరి. బండిఆత్మకూరు మండలంలోని లింగాపురం గ్రామం. 8 సంవత్సరాల క్రితం చిగురు కోసమని చింత చెట్టెక్కడంతో కాలుజారి కిందపడటంతో వెన్నుపూస విరిగింది. రెండు కాళ్లు పనిచేయక మంచానికే పరిమితమైంది. వైద్యులు .... వైకల్యం ఉన్నట్లు నిర్ధారించడంతో పింఛను అందుతోంది. ఆలనాపాలన చూసుకుంటున్న భర్త గోపాల్‌రెడ్డి(55) రెండేళ్ల క్రితం కాలం చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రీవెరిఫికేషన్ పేరిట ఈమెకు వికలత్వం 40శాతం లోపు ఉన్నట్లుగా నిర్ధారించి పింఛను తొలగించారు. కనీసం కదల్లేని స్థితిలో ఉన్న ఈమె ప్రభుత్వ నిర్ణయం పట్ల కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.



కదల్లేని స్థితిలో చాముండేశ్వరి

కుట్రపూరితంగానే తొలగింపులు

తుగ్గలి: ఎన్నికల ముందు సంక్షేమ పథకాలతో ఊరించిన చంద్రబాబు గద్దెనెక్కిన తర్వాత కోతలు మొదలుపెట్టారు. దివ్యాంగులపై కనీస కనికరం లేకుండా అనర్హుల పేరిట ఎడాపెడా తొలగింపులకు పాల్పడుతుండటం విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో బాధిత దివ్యాంగులు ప్రసన్న, రామాంజినేయులు, గోవిందరాజులు, వీరాంజినేయులు సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములుతో కలిసి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 20 ఏళ్లుగా వస్తున్న తమ పింఛన్లను తొలగించడం అన్యాయమని వాపోయారు. కాళ్లు లేని వారు, మాటలు రాని వారు, కళ్లులేని వారు సర్కారుకు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెరిఫికేషన్‌లో 70 శాతం వికలత్వం ఉన్నా పింఛన్లు తొలగించడం ఏంటని ప్రశ్నించారు. అర్హుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో కార్యాలయాలు, రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు
- పీజీఆర్ఎస్‌కు 83 ఫిర్యాదులు



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

కర్నూలు: ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజికల్ ట్రైనర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి విజయవాడకు చెందిన శివ, కోవెలకుంట్లకు చెందిన రామకృష్ణలు కలసి ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల చొప్పున డబ్బులు తీసుకుని మోసం చేశారని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన రాజశేఖర్, నరేష్, లింగరాజు, పీటర్‌పాల్, చైతన్యలు ఫిర్యాదు చేశారు. ఆదోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దేవదానం, జ్యోతి కలసి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని కౌతాళం మండలం చింతపల్లి గ్రామానికి చెందిన రాజు, మునిస్వామిలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

➡ కోడలు, ఆమె బంధువులు తన కుమారుడిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని గణేష్ నగర్‌కు చెందిన అజ్మత్ ఖాన్ ఫిర్యాదు చేశారు.

➡ కొడుకు, కోడలు తమపై దాడి చేసి పాదుపులో వచ్చిన డబ్బులు లాక్కున్నారని తుగ్గలి మండలం గుండాలతండాకు చెందిన దానమ్మ, రాముడు నాయక్ దంపతులు ఫిర్యాదు చేశారు.

➡ తమ్ముడు శివరాజు మద్యానికి బానిసై తల్లిదండ్రులు తనకు ఇచ్చిన ఆస్తి భాగాన్ని వేరేవాళ్లకు అమ్ముకున్నాడని, విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా ఆదోని స్వామిరెడ్డి నగర్‌కు చెందిన తిరుపాల్ ఫిర్యాదు చేశారు.

కాలనీ సమస్యలపై 'ఫ్లెక్సీ'



వెల్దుర్తి రాణితోట కాలనీలో ఏర్పాటైన ఫ్లెక్సీ

వెల్దుర్తి: పట్టణంలోని రాణితోట కాలనీవాసులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కాలనీ ముఖద్వారంలో ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అందులో సమస్యలను ప్రస్తావించారు. ఈ ఫ్లెక్సీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని రాణితోట వీధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కుళాయిల పైప్‌లైన్ వేసిన తర్వాత కంకర, సిమెంట్‌తో మూయకపోవడం, కాలువలు కాదని దారిలోకి ఇళ్ల నిర్మాణాలు ముందుకురావడంతో గుంతలు తోడు దారి సమస్య తీవ్రమైంది. కొన్ని చోట్ల మురుగు కాలువలు లేవు. ఈ సమస్యలను తాము ఎంతమంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే ఇలా ఫ్లెక్సీ వేసి నిరసన తెలిపినట్లు కాలనీవాసులు తెలిపారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించకపోతే చర్యలు



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రాలు ఇస్తున్న ప్రజలు

కర్నూలు(సెంట్రల్): నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో(పీజీఆర్ఎస్) కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువు దాటినా అర్జీలను పరిష్కరించని ఆదోని మునిసిపల్ కమిషనర్, జిల్లా రిజిస్ట్రార్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మను ఆదేశించారు. అదేవిధంగా అర్జీలను పెండింగ్‌లో పెట్టిన అధికారులందరిపైనా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. అధికారులకు కేవలం మెమోలు ఇవ్వడం కాదని, వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్‌పీడీ చిరంజీవి, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా ఈరన్న స్వామి పల్లకీ మహోత్సవం



భక్తుల మధ్య ఈరన్న స్వామి పల్లకీ మహోత్సవం

కౌతాళం/కోసిగి: ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకీ మహోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. తెల్లవారుజామున 4 గంటలకు ఉరుకుంద గ్రామంలోని ఈరన్నగౌడు ఇంటి వద్ద ఉన్న స్వామివారి పల్లకీకి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి పల్లకీని పాదయాత్రతో కోసిగి మండలం కందుకూరు వద్ద ఉన్న తంగభద్ర నదికి చేర్చారు. స్వామి విగ్రహానికి నదిలో జలాభిషేకాన్ని నిర్వహించి నది ఒడ్డున ప్రత్యేక పూజలు చేశారు. కోసిగి, మంత్రాలయం మండలాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పల్లకీ మహోత్సవంలో పాల్గొన్నారు. కందుకూరు నుంచి పల్లకీ బయలుదేరి కామనదొడ్డి, తిప్పలదొడ్డి, కరణి, మల్లనహట్టి, చిరుతపల్లి గ్రామాల మీదుగా అడుగడుగాన పూజలందుకుంటూ ఉరుకుందకు పొలిమేరకు రాత్రి 7గంటలకు చేరుకుంది. అక్కడ స్వామి వారి పల్లకీకి మేళతాళలతో, బాణసంచలతో ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి, ప్రధాన, ఉపప్రధాన అర్చకులు, గ్రామపెద్దలు స్వాగతం పలకారు. పొలిమేర నుంచి దేవాలయానికి పల్లకీ చేరుకునేంత వరకు అడుగడుగునా టెంకాయాలను కొట్టారు. భక్తుల కోసం దేవాలయ అధికారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పల్లకీ దేవాలయంలో ప్రవేశించిన తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కోసిగి మండల కన్వీనర్ బెట్టన్నగౌడ్, ఉరుకుంద ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నదిలో స్వామికి జలాభిషేకం

అధిక వర్షాలు.. పొలాల్లో కన్నీళ్లు!

- జిల్లాను వీడని వర్షాలు
- ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ.
- ఇప్పటి వరకు 175.5 మి.మీ. నమోదు
- 1,598 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు



గోనెగండ్ల మండలంలో వర్షాలకు దెబ్బతిన్న వేరుశనగ పంట



కృష్ణగిరి మండలం మన్నెకుంట సమీపంలో పత్తి పైరులో నిలిచిన నీరు



వర్షానికి పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

కర్నూలు(అగ్రికల్చర్): అధిక వర్షాలు అన్నదాతల ఆశలను నీరుగారుస్తున్నాయి. దాదాపు 10 రోజులుగా తేమ ఆరకుండా వరుసగా వర్షాలు పడుతుండటంతో వివిధ పంటలు కుళ్లి పోతున్నాయి. అధిక వర్షాలతో పత్తి పంటకు అపార నష్టం వాటిల్లింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా కల్లూరులో 39.6, అత్యల్పంగా మద్దికెరలో 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం మీద సగటున 18.9 మి.మీ. వర్షం కురిసింది. కల్లూరులో 39.6, నందవరంలో 37.8, కర్నూలు రూరల్‌లో 37.4, సి.బెళగల్‌లో 36.4, కర్నూలు అర్బన్‌లో 36.2, ఓర్వకల్లులో 34.6, మంత్రాలయంలో 31.4, గూడూరులో 29, కోసిగిలో 26.8, ఎమ్మిగనూరులో 22.6, కోడుమూరులో 19.6 మి.మీ. ప్రకారం వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ. ఉండగా... ఇప్పటి వరకు 175.5 మి.మీ. నమోదైంది. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

భారీగా పంట నష్టం...

అధిక వర్షాలతో భారీగా పంట నష్టం జరిగింది. అనధికార సమాచారం మేరకు వివిధ మండలాల్లో దాదాపు 5,000 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అయితే వ్యవసాయ శాఖ అధికారులు 1,598 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఏడు మండలాల్లోని 36 గ్రామాలు అధిక వర్షాల బారిన పడటంతో వేరుశనగ, కంది, సజ్జ, పత్తి, ఆముదం, వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అధిక వర్షాలతో పత్తిలో చీడపీడల సమస్య పెరిగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


లలిత్‌కుమార్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సోమప్ప నగర్‌లో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదోనికి చెందిన ఈరన్న, రాజేశ్వరి దంపతులు పదేళ్ల క్రితం ఎమ్మిగనూరుకు వలస వచ్చి సోమప్ప నగర్‌లో నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈరన్న గౌండ పని చేస్తుండగా, రాజేశ్వరి పెళ్లిళ్లలో వంట పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. కుమారుడు లలిత్‌కుమార్ (19) ఆదోని భీమా ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతూ మధ్యలోనే మానేసి కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కాగా కొన్ని రోజులుగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ ఆదివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని పడుకున్నాడు. సోమవారం ఉదయం ఎంతకీ తలుపులు తీయకపోవటంతో కుటుంబీకులు అనుమానంతో కిటికీలోంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. తలుపులు బద్దలుకొట్టి కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడి ఆత్మహత్యతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వి. శ్రీనివాసులు తెలిపారు.

హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానా

- మొదటి రోజు 150 మందికి రూ.1.50 లక్షల అపరాధ రుసుం


అప్పటికప్పుడు హెల్మెట్ కొనుగోలు చేసిన వాహనదారుడిని రోజా పుష్పంతో అభినందిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనంపై రోడ్డెక్కితే ఇక జేబుకు చిల్లే. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు లేకపోయినా, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని అడ్డగించి భారీగా జరిమానాలు విధించారు. దాదాపు 150 మంది హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.1.50 లక్షల అపరాధ రుసుం విధించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వ్యక్తులను ఆపి అరగంట పాటు సమయమిచ్చి హెల్మెట్ తెచ్చుకున్న తర్వాత వారికి రోజా పుష్పం ఇచ్చి వాహనాలను అప్పగించారు. ఇకపై హెల్మెట్ లేకుండా నడిపే వ్యక్తులను ఉపేక్షించేది లేదని సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు.

జీవితంపై విరక్తి చెంది..

గడివేముల: పెసరవాయి గ్రామానికి చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బెలుం గాయత్రి (30) తెలంగాణ రాష్ట్రం నల్గొండలో కెనరా బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తుంది. కొన్ని రోజుల నుంచి పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మానసికంగా బాధపడుతూ సోమవారం ఉదయం పెసర వాయి గ్రామంలో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుంచగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ నాగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఒళ్లంతా ముళ్లు.. మువ్వన్నెల పూలు!





ప్రకృతి అందాలతో మనసుకు సాంత్వన చేకూరుతుంది. కాంక్రీటు వనాలైన నగరాల్లో అడుగడుగునా కాలుష్యం నిండుకుంటోంది. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం అక్కున చేర్చుకుంటుంది. కొండ ప్రాంతాల్లో అరుదుగా కనిపించే కొన్ని మొక్కలను చూస్తే వాటి అందానికి అలా నిల్చుండిపోవాల్సిందే. కర్నూలు నగర శివారులోని మీదివేముల గ్రామ సమీపంలో నల్ల జమ్మి చెట్లకు ఒళ్లంతా ముళ్లున్నా.. ఆకట్టుకునే పూలతో అందాలను విరజిమ్ముతోంది. ఒకే చెట్టుకు రెండు రకాల పూలు మూడు రంగుల్లో ఆ దారిన వెళ్లే వారిని ఆగి చూసెళ్లమని ఆహ్వానిస్తుండటం విశేషం. రాజస్తాన్‌లోని అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కనిపించే ఈ చెట్టు.. జిల్లాలో అరుదుగా కొండ ప్రాంతాల్లో కనువిందు చేస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఆర్‌యూసీఈలో తగ్గిన ఇంజినీరింగ్ ప్రవేశాలు

- సీఎస్‌ఈలో పూర్తిగా భర్తీ కానీ సీట్లు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నిల్ అడ్మిషన్లు
- మెకానికల్‌లో ఒక్క సీటు భర్తీ



కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఆర్‌యూసీఈ)లో ఇంజినీరింగ్ అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి. ఏపీఈఏపీ సెట్ ఇంజినీరింగ్ స్ట్రీమ్ అడ్మిషన్ల రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ సైతం ముగిసింది. ఆర్‌యూసీఈ అడ్మిషన్ల వివరాలను పరిశీలిస్తే గత ఏడాది కంటే ఈ ఏడాది 89 సీట్లు మిగిలిపోయాయి. వర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌లో సమస్యలు, హాస్టల్ నిర్వహణలో లోపాలు, ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం, కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీతో తరగతులు నిర్వహించడం, మరీ ముఖ్యంగా నాలుగు నెలల నుంచి కళాశాల పరిపాలన, అకడమిక్ వ్యవహారాలు చూసేందుకు ప్రిన్సిపాల్ లేకపోవడం కారణాలుగా ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆర్‌యూసీఈకి వర్సిటీ రిజిస్ట్రార్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. కళాశాలకు ప్రత్యేకంగా మౌలిక వసతులు లేవు. ల్యాబ్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఏఐసీటీ అనుమతితో ఏర్పడిన మొదటి ఇంజినీరింగ్ కళాశాల ఆర్‌యూసీఈ అయినప్పటికీ అడ్మిషన్లు తగ్గాయి.

సీఎస్‌ఈలో సైతం తగ్గిన ప్రవేశాలు..

అన్ని కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో అన్ని సీట్లు భర్తీ అయ్యాయి. ఆర్‌యూసీఈలో సైతం గత ఏడాది 132 సీట్లకు 132 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ ఏడాది మాత్రం 132 సీట్లకు 125 భర్తీ కాగా 7 సీట్లు మిగిలిపోయాయి. ఏఐలో గత ఏడాది 66 సీట్లకు 62 భర్తీ కాగా ఏడాది ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో గత ఏడాది రెండు, ఈ ఏడాది ఒక్క అడ్మిషన్ మాత్రం వచ్చింది. కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీని నియమించి, ల్యాబ్ వసతి కల్పిస్తేనే కళాశాల మనుగడ ఉంటుందని, పలువురు మేధావులు సూచిస్తున్నారు.

తుంగభద్ర పరవళ్లు

- సుంకేసులకు 98 వేల క్యూసెక్కుల వరద

కర్నూలు సిటీ: ఎగువ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర డ్యాం నుంచి వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు కర్ణాటక, ఏపీ సరిహద్దులోని వేదావతి నది నుంచి, జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కురిసిన వర్షాలతో సోమవారం తుంగభద్రకు వరద ఉద్ధృతి పెరిగింది. టీబీ డ్యాం నుంచి 26 గేట్లను పైకెత్తి దిగువకు 1,14 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. మంత్రాలయం దగ్గర 98,882 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. ఎగువ నుంచి వస్తున్న నీటితో దృష్టిలో పెట్టుకొని జల వనరుల శాఖ ఇంజినీర్లు అప్రమత్తం అయ్యారు. తుంగభద్ర నది తీరంలోని గ్రామాల్లో ప్రజలను నదిలోకి వెళ్లకూడదని అప్రమత్తం చేశారు. సుంకేసుల బ్యారేజీ నుంచి ప్రస్తుతం 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు బ్యారేజీ నుంచి కృష్ణానదిలోకి 180 టీఎంసీల నీటిని విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు 5 టీఎంసీల వరకు నీటిని విడుదల చేసినట్లు జల వనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

హాస్టళ్లలో ప్రవేశాన్ని నిషేధించడం నిరంకుశత్వం

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారు కొండ సాయికుమార్


అంబేడ్కర్ విగ్రహం నిరసన చేస్తున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు

కర్నూలు (టౌన్): స్కూల్స్, హాస్టళ్లు, కళాశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారు కొండ సాయి కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కర్నూలు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జీవోను రద్దు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. స్కూళ్లు, హాస్టళ్ల సమస్యలతో సతమతమవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు బబ్లు, చిన్నరాజు, మహేష్, వేణు, రాజుతదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దోపిడీ దొంగల ముఠా

తనకల్లు: సత్యసాయి జిల్లాలోని తనకల్లు మండలం దిగువ చెక్కవారిపల్లి, ఎగువ చెక్కవారిపల్లి మధ్య ఉన్న కొండగుట్టల్లో గుడారాలు వేసుకుని తలదాచుకున్న దోపిడీ దొంగల ముఠాను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నంద్యాల జిల్లా పాణ్యం ప్రాంతంలో ఈ ముఠా సభ్యులు పెద్ద ఎత్తున దోపిడీలు, దొంగతనాలు చేయడమే కాకుండా మహిళలపై అత్యాచారాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో స్థానిక పోలీసులతో కలసి గ్రామస్తుల సహకారం తీసుకుని కొండ గుట్టల్లోని గుడారాలను పాణ్యం పోలీసులు చుట్టుముట్టి ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వలలు వేసి అడవి పందులను పట్టుకునే తరహాలోనే వల పన్ని పది మంది వరకూ దొంగలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి విలువైన బంగారు నగలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

47 నూతన మద్యం బార్లకు నోటిఫికేషన్

- 26వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 28న లాటరీ ద్వారా బార్ల కేటాయింపు
- సెప్టెంబర్ 1 నుంచి అందుబాటులోకి కొత్త బార్లు
- కలెక్టర్ అనుమతితో గజిట్ విడుదల చేసిన ఎక్సైజ్ అధికారులు


గీత కులాలకు కేటాయించిన బార్ల రిజర్వేషన్ కోసం లాటరీ తీస్తున్న జిల్లా కలెక్టర్

కర్నూలు: మూడేళ్ల కాల పరిమితితో నూతన మద్యం బార్ పాలసీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు నూతన పాలసీ అమలులో ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి 47 నూతన మద్యం బార్లకు కలెక్టర్ల అనుమతితో ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ అధికారులు సుధీర్ బాబు, రవికుమార్ సోమవారం గజిట్ విడుదల చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నూతన బార్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈనెల 28న కర్నూలుకు సంబంధించి జిల్లాపరిషత్ సమావేశ భవనం, నంద్యాలకు సంబంధించి కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో లాటరీ పద్ధతిలో ఆయా జిల్లాల కలెక్టర్ల సమక్షంలో బార్లను కేటాయించనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్త బార్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కొక్క దరఖాస్తు విలువ రూ.5 లక్షలు నాన్ రీఫండబుల్ ఫీజు, రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. నూతన మద్యం బార్ల దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన ఒకే స్లాబ్‌లో లైసెన్స్‌దారుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయనున్నారు. 55 లక్షల జనాభా లోపు ఉన్న ప్రాంతంలో రిటైల్ ఎక్సైజ్ రుసుం రూ.35 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే గూడూరు నగర పంచాయతీలో మాత్రం 50 వేల లోపు జనాభా ఉన్నందున రూ.35 లక్షలు రిటైల్ ఎక్సైజ్ రుసుం చెల్లించాలి.

☛ ఏ ప్రాంతం, ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయినా నూతన మద్యం బార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

☛ ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా కొనుగోలు చేయవచ్చు. ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

☛ అందిన దరఖాస్తుల్లో ఒక్కొక్క బార్‌ను లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. వీటితో పాటు గౌడ కులాలకు కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 2, ఆదోని మున్సిపాలిటీలో 1, నంద్యాల మున్సిపాలిటీలో 1, డోన్ మున్సిపాలిటీ పరిధిలో 1 చొప్పున రిజర్వేషన్ ప్రాతిపదికన బార్లను కేటాయించనున్నారు.

☛ ఇందుకోసం గౌడ్, ఈడిగ కులాలకు సంబంధించిన వారు రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించిన దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు.

పొడిగించిన వ్యాపార సమయాలు...

బార్లు ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు (14 గంటలు) అనుమతించబడతాయి. గతంలో 11 గంటల వరకే అనుమతి ఉండేది. అయితే ఒక గంట సమయాన్ని పెంచుతూ మందుబాబులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. లైసెన్స్ రుసుం ఆరు సమాన వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుంది. ఇన్‌స్టాల్‌మెంట్‌కు సరిపడ బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలనే నిబంధన విధించారు. బార్లకు కూడా ఏ4 దుకాణాల మాదిరిగానే ఏపీఎస్‌డీసీఎల్ నుంచి మద్యం స్టాక్ కొనుగోలు చేసుకోవచ్చు. లైసెన్స్ పొందినవారు 15 రోజుల లోపు రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాలు, కార్పొరేషన్ పరిధిలో 10 కిలోమీటర్లు నిడివిలో, మున్సిపల్ ఏరియాలో మూడు కిలోమీటర్ల దూరం ఉండేలా బార్లు ఏర్పాటు చేసుకోవాలి.

కర్నూలు జిల్లాలో బార్ల ఏర్పాటు ప్రాంతాలు...

కర్నూలు కార్పొరేషన్‌లో 16 జనరల్ కేటగిరీ 2 గీత కులాలకు, ఆదోని మున్సిపాలిటీలో 4 జనరల్ కేటగిరీ 1 గీత కార్మికులకు కేటాయించారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 2, గూడూరు నగర పంచాయతీలో 1 బార్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది.

నంద్యాల జిల్లాలో....

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 14 జనరల్ కేటగిరీ 1 గీత కులాలకు, డోన్ మున్సిపాలిటీలో 1 జనరల్ కేటగిరీ మరొకటి గీత కులాలకు కేటాయించారు. నందికొట్కూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బేతంచెర్లలో ఒక్కొక్కటి చొప్పున బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది.

గుర్తుతెలియని వ్యక్తికి ప్రాణం పోశారు!


చికిత్స పొందుతున్న రవి

కర్నూలు(హాస్పిటల్): ఓ హోటల్‌పై నుంచి కింద పడి తీవ్ర గాయాలతో అర్ధరాత్రి ఆసుపత్రిలో చేరాడు. అతను ఎవరో తెలియదు. ఎక్కడి వాడో వివరాలు లేవు. అతని వద్ద ఎవ్వరూ తోడు లేరు. ఇలాంటి పరిస్థితుల్లో డ్యూటీలో ఉన్న వైద్యులు అత్యవసరంగా అతనికి ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. కర్నూలు బస్టాండ్ సమీపంలో ఉండే నిర్మల హోటల్‌లో పనిచేసే రవి స్వస్థలం ఒంగోలు. కొంత కాలంగా ఒక్కడే హోటల్‌లో పనిచేస్తూ ఒంటరిగా అక్కడే నిద్రించేవాడు. ఆదివారం అర్ధరాత్రి హోటల్‌పై నుంచి అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు తీసుకొచ్చి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించారు. క్యాజువాలిటీలో డ్యూటీలో ఉన్న వైద్యులు అతన్ని పరీక్షించి ప్లీహంకు తీవ్ర గాయమైనట్లు గుర్తించారు. ఇలాంటి సమయంలో అతని ప్లీహంను తొలగించాల్సి ఉంటుంది. సాధారణంగా గుర్తుతెలియని వ్యక్తులకు ఏదైనా అవయవం తొలగించాల్సి వస్తే కుటుంబసభ్యుల అనుమతి తీసుకోవాలి. కానీ అతని వద్ద ఎవ్వరూ లేకపోవడంతో ఆసుపత్రి ఇన్‌చార్జ్ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణకు వైద్యులు ఫోన్ చేసి విషయం తెలిపారు. వెంటనే ఆయన అత్యవసర ఆపరేషన్‌కు అనుమతి ఇచ్చారు. ఆ వెంటనే జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ, మొదటి యూనిట్ చీఫ్ డాక్టర్ హరిచరణ్ ఫోన్ చేసి ఆయన సూచనలతో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ అహద్ అత్యవసరంగా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఆపరేషన్ చేసి ప్లీహం తొలగించి ఆయన ప్రాణాన్ని కాపాడారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏఎంసీలోని ఎస్‌యూసీఐలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఉదయం హోటల్‌కు చెందిన పలువురు వ్యక్తులు ఆయన వద్దకు వచ్చారు.

వన్‌టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన దళితుడు నంచర్ల రమేష్‌పై దాడి చేసిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌తో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు, మానవ హక్కుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.జి.శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయూ నాయకులు నరసన్న, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసన్న మాట్లాడుతూ.. గత జూలై నెల 30వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ప్రభాకర్ టాకీస్ వద్ద తోటి స్నేహితులతో కలిసి మాట్లాడుతున్న రమేష్‌ను సీఐ శ్రీరాములు బూతులు తిడుతూ, వాహనంలో స్టేషన్‌కు తరలించారన్నారు. స్టేషన్‌లో దారుణంగా హింసించి దాడి చేశారన్నారు. తీవ్ర గాయాలపాలైన రమేష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి, పోలీసులపై ఎదురు తిరిగాడని జూలై 31వ తేదీన రమేష్‌పై అక్రమ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. దళితుడిపై దాడికి పాల్పడిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వెంకటేష్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సుజ్ఞానమ్మ, నాయకులు నేతప్ప, నానేపాటి, ప్రసాద్, గిరి, ఆనంద్, యేసోబు, దేవేంద్ర, ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన


టోకన్లు చూపుతున్న రైతులు


కౌతాళం: యూరియా కోసం నెల క్రితం డబ్బులు చెల్లించినా ఇవ్వకపోవడంతో రైతులు సోమవారం టోకెన్లు చూపిస్తూ ఆందోళన నిర్వహించారు. సహకార పరపతి సంఘానికి ఐదు లోడ్లలో 1400 వందల సంచులు యూరియా వచ్చింది. డబ్బులు తీసుకుని టోకన్లు ఇచ్చిన రైతులకు కాదని మిగితా రైతులకు ఆధార్‌కార్డు తీసుకుని రెండు సంచుల ప్రకారం యూరియా ఇస్తున్నారు. ఇదేమని వ్యవసాయాధికారిని ప్రశ్నించగా 'మీకు ఐదు నుంచి పది సంచుల వరకు ఇచ్చేది ఉంది. మిగిలితే ఇస్తాం' అని సమాధానం ఇచ్చారు. దీంతో టోకన్లు ఉన్న రైతులు ఆందోళనకు దిగారు. తమ కళ్ల ముందే యూరియా నాయకులకు, భూస్వాములకు ఇస్తున్నారని రైతులు ఖాదరయ్య, నర్సయ్య, వీరేష్, లింగన్న, సుకేంద్ర, గొట్టయ్య, రామచంద్ర, వెంకన్న ఆరోపించారు. యూరియా ఇస్తామని చెప్పడంతో పొలాలకు వెళ్లకుండా ఉదయం నుంచి సహకార పరపతి సంఘం వద్ద వేచి ఉన్నా వ్యవసాయాధికారి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నడని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భళా.. కర్ణ


175 కేజీల గుండును ఎత్తుతున్న కప్పగల్ కర్ణ

కోసిగి: గుండెత్తు పోటీల్లో కర్ణాటకకు చెందిన కప్పగల్ కర్ణ సత్తా చాటాడు. ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా సోమవారం కందుకూరులో గుండెత్తుట, ఇసుక సంచి ఎత్తుట, పరుగు పందెం, ట్రిపుట్ జంప్ పోటీలు నిర్వహించారు. ఇందులో 175 కేజీల గుండును కర్ణాటక రాష్ట్రానికి చెందిన కప్పగల్ కర్ణ అనే వ్యక్తి మూడు సార్లు అవలీలగా ఎత్తి ప్రథమ బహుమతి గెలుపొందారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి రూ.5100 నగదును అందజేశారు. శారదళ్లి సక్కీరప్ప అనే వ్యక్తి రెండు సార్లు ఎత్తి ద్వితీయ బహుమతి గెలుపొందగా ఈయనకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ రూ.5000ను అందించారు. అలాగే 220 కేజీల ఇసుక సంచి మడినాళ్ల ఎళ్ల లింగా అనే వ్యక్తి ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈయనకు టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి రూ.7,100 నగదును అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన శారదళ్లి మరియప్పకు రూ.4100 ముత్తురెడ్డి అందజేశారు. 5 కిలో మీటర్లు పరుగు పందెం పోటీల్లో పెద్దతుంబళం ఈరన్న, తిమ్మప్ప ద్వితీయ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

దంపతులను రక్షించిన పోలీసులు


దంపతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె రూరల్: అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన దంపతులను పోలీసులు రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు సకాలంలో స్పందించడంతో ఇద్దరిని కాపాడారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి ఆయన భార్య శశికళ కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. అయితే వారికి రూ.3 లక్షల అప్పులు ఉండడంతో, అప్పును తీర్చలేక మానసికంగా కుంగిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బనగానపల్లెకు వచ్చారు. కుటుంబీకులు అనుమానంతో బనగానపల్లె పోలీసులకు సమాచారం ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో వారి వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా రవ్వల కొండ సమీపంలోని ఎస్‌ఆర్‌బీసీ కాల్వ వద్ద ఆత్మహత్యకు యత్నించేందుకు సిద్ధంగా ఉన్న దంపతులను ఎస్‌ఐ దుగ్గిరెడ్డితో పాటు పోలీసు సిబ్బంది గుర్తించారు. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి ఆత్మహత్య చేసుకునే ఆలోచన నుంచి విరమింపచేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జీవితం చాలా అమూల్యమైందని, చిన్నచిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకోరాదని సీఐ సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మనోధైర్యంతో ఎదుర్కోవాలన్నారు. దంపతులను రక్షించిన ఎస్‌ఐ దుగ్గిరెడ్డితో పాటు పోలీసులను ఉన్నతాధికారులతో పాటు పలువురు అభినందించారు.